పోసిబిలిటీ:— మీకు బాగా ఆకలి వేస్తోంది. అప్పుడు అవతలి వాడు ఏది ఆర్డరిస్తే మీరూ అదే చెప్పండి. అందుచేత బిల్ మీ ప్రాప్తి అవడానికి అవకాశాలు 50%. సరే, గేంబిల్ చెయ్యండి. ఆ పైన మీ అదృష్టం.

4. సరే, తినడం అయింది. సర్వర్ బిల్లు తేవటానికి లోపలకు వెళ్ళాడు. మీరు గబ గబ బయటకు వెళ్ళి సిగరెట్స్ (బెర్కిలీ మాత్రం), వక్కపొడి కొని తెండి.

లాభం:— ఇలా చేయడం వల్ల పావలా, అర్ధతో తేలిపోతుంది. అవతలి వాళ్ళు వచ్చినట్టు బిల్లు యివ్వాలి.

నష్టం:— అవతలివాళ్ళు మీ ఎత్తు పసికట్టి బిల్ కూడా మీ చేతి కిచ్చారను కోండి. ఇది అదనపు దండగ, మీ దురదృష్టం. పరిస్థితులను బట్టి మసలుకోవాలి. వెనక నకులుడో, ఎవడో చినుకు చినుక్కి మధ్యన గుర్రాన్ని తోలినట్టు.


5. డబ్బు చెల్లించే వాణ్ని ముందరే సెలెక్టు చేసుకొన్నారను కోండి. అప్పుడు మీ ఋణం ఉంచుకోకుండా వాణ్ని పొగడండి. "అబ్బ! ఇవాళ లెక్చరర్ని ఏం ఏడిపించావురా" అనో, "ఇవ్వాళ సెకండ్ అవర్లో సీత నీకేసే చూసింది" అనో.

6. సర్వర్ బిల్లు తీసుకొని వస్తాడు. మీరు దగ్గరున్న న్యూస్ పేపరో, లేక మేగజైనో (కూడా తీసుకొని వెళ్ళటం చాల మంచిది: "పుస్తకం హస్త భూషణం" అని పెద్దలు ఊరికేనే అన్నారా?) దీక్షగా చదివేస్తూ వుండాలి— ఎవడో ఒకడు బిల్లు తీసుకునే వరకూ.

7. ఇక యిది ఆఖరి సీను. సర్వర్ బిల్లు మీ చేతిలో పెట్టాడు. ఇక మీరే "పే" చెయ్యాలి. అయినా నిరుత్సాహపడకండి. ధైర్యంగా కౌంటర్ దగ్గర కెళ్ళి పది రూపాయిలనోటు విసరండి. ఒక్కొక్కసారి చిల్లర ఉండక పోవచ్చు ప్రొప్రయిటర్ దగ్గిర. అందులో ముందర ఎవడైనా పది రూపాయల చిల్లర తీసుకొని వెళ్ళాడో లేదో చూసి మరీ వెళ్ళండి. మీ గ్రహ బలం బాగుంటే, "చిల్లర లేదండి" అంటాడు. అప్పుడు మీరు దర్జాగా "ఒరేయ్! ఛేంజ్ వుంటే ఎవ్వరైనా పే చెయ్యండిరా" అనొచ్చు.

8. సరే. బిల్ "పే" చేసి వచ్చారు దిగాలు ముఖంతో. కాని ఉత్సాహం పుంజుకొని సినిమా ప్రోగ్రాం పెట్టేయండి. కొంత నష్టమైనా కూడ దీయవచ్చు. గుడ్ లక్!

—నందుల సుబ్రహ్మణ్యమ్



# సర్వీసు రిజిష్టరు

"ఇదిగో రామన్నా! బుద్ధుందా నీకు? నేను చెప్పిందేమిటి? నువ్వు చేసిం దేమిటి?"

"మీరు చెప్పిందేనండమ్మగారూ! పరుపులు తీసి ఎండలో వేయమన్నారు. వేయబోతుండగా, మళ్ళీ వేసుకోవచ్చుగానీ బజారుకెళ్ళి తలనూనెబుడ్డి తీసుకరమ్మన్నారు...."

"సర్లే - సంజాయిషీ చెప్పొచ్చావు. మరేం లేకపోయినా మాటలకు మాత్రం కొదువలేదు...."

కిటికీ లోనుంచి రామన్నకు జరుగుతున్న మర్యాదను శ్రద్ధగా కనిపెడుతున్న వంటలక్క సీతమ్మ, లోపలికి వెళ్ళగానే అతణ్ణి పరామర్శించింది.

"ఇంతకు మునుపు నాకూ వడ్డన జరిగిందిలే రామన్న మామా! ఆ కాడికీ మన పాడేనయం. నిద్రలేచి ఎవరిముఖం చూచాడో ఆఫీసు జవాను. నెల రోజులప్పుడెప్పుడో చెప్పిన పని చేయలేదని విదిలించి పారేసింది. ఏం విడ్డూరమోగానీ, తెల్లారినప్పటినుంచీ అమ్మగారి వాలకమంతా అదో రకంగా వుంది. అంతెందుకు,—తోటలోనుంచీ ఓ రోజాపువ్వు తెచ్చివ్వు. ఒకసారి వాసన చూచేసరికి అది మాడి మసై పోవాలి. ఒక రొప్పడమూ, ఒక రోజడమూ! దరిదాపుల్లోకి మనుషులు వెళ్తే విరుచుక పడిపోయిందన్న మాటే!"

నిజమే! లీలావతమ్మ మనసు మనసులో లేదు.

కానీ లీలావతమ్మ మనసు మనసులో లేక పోవడానికి నౌకర్ల అవిధేయత, భర్త ప్రవర్తన, బిడ్డల అవినయం లాంటివేవీ కారణాలు గావు. అలాంటి కారణాలవల్ల ఆమె యిలా తల్లక్రిందులై పోవడమన్నది ఆ కుటుంబ చరిత్రలో అపూర్వమైన విషయం. ఆ మాట కొస్తే నౌకర్లు గడగడ లాడటానికి లీలావతమ్మ క్రీగంటి దృక్కోణం నుంచీ ప్రసరించే నిశిత వీక్షణం ఒక్కటి చాలు. అమ్మగారి మాట జవదాటితే తమకు రానున్న ముప్పు ఎలాంటిదో ఆఫీసు జవాన్లకు క్షుణ్ణంగా తెలుసు. ఒక్క చూపుతో పనివాళ్ళను, ఒక్క నవ్వుతో భర్తను, ఒక్క మాటతో బిడ్డలను అదుపులో వుంచుకోగలిగిన లీలావతమ్మలో హఠాత్తుగా యిలాంటి మార్పు పొడసూపిందంటే—అందుకు కారణం చెప్పుకోదగినంత గొప్పదే అయివుండాలి....

అదేమిటో నౌకర్లకు అంతుపట్టడం లేదు.

బిడ్డల సంగతి అందుకు డిటో గానే వుంది.

వేసవి సెలవులు సంతానమంతా యింటి దగ్గరే వుంది. పరీక్షలకోసం తెగ చదివి పుస్తకాల పైన్నే విరక్తి పుట్టి యిక మళ్ళీ కాలేజీ తెరిచేదాకా అక్షరం ముఖం చూడ గూడదనుకొని ఒట్టు వేసుకున్న రవిబాబు, తల్లిగారి ధోరణికి అర్థం స్ఫురించక చివరికొక పుస్తకాన్నే శరణుగోరి తోటలోకి వెళ్ళిపోయాడు. రేడియో సంగీతానికి అనువుగా భరత నాట్యాలు సలిపే హైస్కూలు కుర్రాళ్ళు రాము, శేషూ గదిలో నక్కి కూర్చుని బుద్ధిమంతుల్లా పత్రికల్లో బొమ్మలు చూచుకుంటున్నారు. చిట్టచివరి పిల్లలిద్దరూ గాలి పీకల తూతూ మేళాన్ని గూడా కట్టిపెట్టి పెరట్లో మల్లె పందిరి క్రింద గుట్టుచప్పుడుగా బొమ్మల పెళ్ళి చేసుకుంటున్నారు. ఎటొచ్చీ కానరాకుండా వున్నది పెద్దమ్మాయి సులోచన పొలకువ మాత్రమే! తలుపులు బిడాయించుకుని గదిలో మంచంపైన బోరగిల పడుకుని గొంతెత్తి ఏడువలేక — ఒక వేళ అలా ఏడవడమంటూ జరిగి, ఎందుకేడుస్తున్నావని ఎవరైనా అడిగితే కారణం బయట పడి చెప్పడానికి వీల్లేనిది గదా అన్న బెంగచేత ఆమె లోలోపలే కుమిలి పోతోందని ఆ కుటుంబంలో ఒక్క వ్యక్తిని మినహాయిస్తే మరెవ్వరికీ తెలియదు.





తెలిసిన వ్యక్తి లీలావతమ్మ.

ఆమె కైనా పెళ్ళి కూతుర్ని ఓదార్చగలిగే పాటి నిబ్బరం కలగడం లేదు. నిబ్బరం మాట దేవు డెరుగు. ఓ వైపున ఆమెకు ఒళ్ళు మండిపోతోంది. ముంత పొగలాంటి కోపం మనోగహ్వర మంతటా నిండి నిబిడీకృతమై బయట పడేదారిలేక, లోపల తావులేక మనిషిని మల్ల గుల్లాలు పెడుతుంటే ఒళ్ళుమండ కేం చేస్తుంది?

ఆ కోపంతోనే స్నానాల గదిలోకి వెళ్ళింది లీలావతమ్మ. బాయిలర్లో నీళ్ళింకా వేడెక్కలేదు. కోపాన్ని వెలిగ్రక్కడానికి అది నిస్సందేహంగా ఒక మంచి అవకాశమే! కానీ అది మామూలుగా స్నానాలు చేసే వేళగాదు. పోనీ చన్నీటి స్నానం చేస్తే?

ఆ పనీ చేసి చూచింది లీలావతమ్మ. శీతోదక స్నానం వల్ల మనసు కాస్త నిమ్మదిస్తుందేమోనన్న ఆశ గూడా అడియాసే అయిపోయింది.

లోకంలో ఎన్ని జబ్బులైతే వున్నాయో, అన్ని చికిత్సలూ వున్నాయి. విరహతాపానికి సైతం వెయ్యిమందుల్ని సూచిస్తాయి ప్రబంధాలు. ఏవిధంగా చూచినా మానసికమైన వేదనకు మాత్రం మందులు మృగ్యమేమో! అప్పటికి తన వూహకందినంతలో ఏవో కొన్ని చిట్కాలు వాడి చూచింది లీలావతమ్మ. ప్రత్యేకించి పండుగలకు పబ్బాలకు కట్టుకునే పట్టుచీరలో ముస్తాబైంది. వేళగాని వేళలో శుభ్రంగా తలదువ్వుకుని కొప్పునిండుకూ పువ్వులు తురుముకుంది. 'అబ్బే నాకేం చింత! ఐనా యిప్పుడేం కొంపమునిగిపోయింది గనుక!' అన్న తెచ్చికోలు ఓదార్పుతో యింట్లో ఈ మూలనుంచీ ఆ మూలకు నాలుగైదు సార్లు బరాబరులు తిరిగింది. ఎంతచేసినా ఎదలో ముల్లులాంటి ఆ చింత మనోవీధిలో నిశ్చలంగా వుండనేవుంది.

లీలావతమ్మ మనస్సు యింతగా కోపఘూర్ణితం కావడానికి మూలకారణమైన వ్యక్తి పేరు విశ్వం. ఆ విశ్వ మన్నవాడు యింకా పాతికేళ్ళయినా నిండని కుర్రకుంక. ఎం. ఏ. పరీక్షలో క్లాసు తెచ్చుకున్నాడన్న మాటేగానీ అతగాడు లోకజ్ఞులవద్ద నేర్చుకోవలసిన పాఠాలు యింకా లక్షవున్నాయి. అతణ్ణి చేదుమేయమని యిక్కడెవరూ చెప్పలేదు. కళ్ళకు గంతలుగట్టి ముళ్ళదొంకల్లో నడిపించలేదు. స్వకులంవాడని చేరదీసి, లేతగుండెలో గొప్ప భవిష్యత్తుకోసం ఆశలు ప్రోదుచేసి మంచి ముత్యంలాంటి పిల్లనిచ్చి పెళ్ళిచేయాలనుకోడమే తమ నేరం! ఒక వేళ తన కిష్టంలేదనే అనుకుందాం. తన

## మధురాంతకం రాజారాం

అభిప్రాయాన్ని ఎందుకు స్పష్టంగా చెప్పకూడదు? తను వలానావారికి అల్లుడు కాబోతున్నట్టుగా వూళ్ళోవారందరూ తలపోసుకున్న తర్వాత అతడిప్పుడు యిలా పెడముఖంపెట్టి వైదొలగి దూరంగా వెళ్ళిపోడంలో ఆంతర్యమేమిటి? అప్పటికిదంతా అల్లాటప్పా వ్యవహారమనా అతడి ఉద్దేశం? అతగాడి కెన్ని గుండెలు?

లీలావతమ్మ చీటికీ మాటికీ కోప్పడే మనిషిగాదు. కానీ అభిమానానికి తగిలిన అవమానం అగ్గిపైన గుగ్గిలం లాంటిది. మనసులో మంటల్ని రగుల్కొల్పే కోపాతిరేకానికి గురైన అనుభవం కలగడానికి - లీలావతమ్మ కిది రెండోసారి! మొదటిసారి యిరవైరెండేళ్ళ క్రితం యించుమించుగా యిలాంటి అనుభవమే కలిగిం దామెకు —

● ● ●

లీలావతమ్మ కొత్తకోడలుగా కాపురంలో కుడికాలు పెట్టిననాటికి సుదర్శనంగారు ఓ గవర్నమెంటు ఆఫీసులో సామాన్య గుమాస్తాప్రాయుడు.

కోడలుగా అత్తమామలకు, మరదలుగా బావగారికి, చెల్లెలుగా తోడికోడలికి సంతృప్తినీ, సంతోషాన్ని కలిగించినా కలిగించక పోయినా లీలావతమ్మ లీలలు భర్తకు మాత్రం అమందానందాన్నే కలిగించాయి. స్వగ్రామంలో వుండి సమష్టి కాపురంలో మెలగవలసిన అవసరంగానీ, అవకాశంగానీ బొత్తిగా లేకపోవడంతో లీలావతమ్మకు ఆదినుంచీ తన దారి నిష్కంటకంగానే తోచింది. సుదర్శనంగారిలో రసికత్వం పాలు హెచ్చు. పదిమంది స్నేహితులు, ప్రపంచ విశేషాల పరిశీలన, సాహిత్య సంగీతాలపట్ల కొంత అభిరుచీ - యివన్నీ పై మెరుగులైతే, ఆఫీసులో ఆధిపత్యం కోసం అనంతకోటి ఉపాయాల అన్వేషణ అన్నది ఆయన వ్యక్తిత్వంలోని లోవెలుగు! అందుకు తగ్గట్టు - ఇల్లు చక్కదిద్దుకునే వంతు మాది, - జగత్తును జేబులో వేసుకునే వంతు మీది - అన్నంత నిష్కర్షగా బాధ్యతల్లో భాగపరిష్కారం చేసిపెట్టగల భార్య దొరికితే ఏ భర్తమాత్రం సంతోషించడు?

సుదర్శనంగారిని అమాయకుడని చెప్పడానికి వీల్లేదుగానీ, అనేక విషయాలను గురించి స్వంతంగా ఆలోచనకు పూనుకుని బుర్రకు శ్రమ కలిగించుకోడం ఆయన స్వభావానికి విరుద్ధం. ప్రత్యక్షంగా తనతో సంబంధంలేని విషయాలపైన తన విశ్వాసాని కెక్కినవారి మాటను వేదవాక్యంగా తీసుకోడమే ఆయన తత్వం. పెళ్ళయిన క్రొత్తలో ఆయన ఆ పెళ్ళిమూలంగా తనకు సంఘంలో ఓ విశిష్టస్థానం లభించినట్టు కలైనా కనలేదు. విచిత్ర మేమిటంటే ఒకనాడు కలైనా కానిది అనతికాలంలో ఆయన పాలిటికి నిఖార్సయిన నిజంగా భాసించింది. అలా భాసించడానికి లీలావతమ్మ కృషితోబాటుగా పరిస్థితులుగూడా కలిసివచ్చాయి.

పెళ్ళినిగురించి ముక్తసరిగా ఓమాట చెప్పమని అడిగితే - ఎవరోగానీ ఒక అనుభవజ్ఞుడు ప్రతివ్యక్తీ ఎప్పుడో ఒకప్పుడు తప్పనిసరిగా తల ఒగ్గవలసిన ప్రమాదం - అన్నాడు. అందులోని అతిశయోక్తిని మినహాయిస్తే వివాహాన్ని జీవితంలోకి గొప్ప మార్పును తీసుకొచ్చే సంఘటనగా ఒప్పు





కోక తప్పదు. లీలావతమ్మ లీలాకుమారిగా వున్న రోజుల్లో పెళ్ళినిగురించి, ఎక్కడో తనకు తెలియకుండా అజ్ఞాతంగా పుట్టి పెరుగుతున్న భర్తనుగురించి ఎలాంటి పగటి కలలుగన్నదో మనకు తెలియదు. అయినా ఒకవిధంగా వూహించడానికి ప్రయత్నించవచ్చు - ఒక కొలను, చుట్టూరా పుష్పవాటిక. ఆ పరిసరాల్లో అందమైన మేడ. ముంగిట వాలుకుర్చీలో ఒక నవయువకుడు. అతడు పొడుగరి. స్థూలకాయుడుగాడు. తెల్లజామపండువంటి దేహచ్ఛాయ గలుగువాడు. ధవళమల్లీకోరకముల దంతపంక్తి గలుగువాడు. మనసుపడి పులి పాలు తెచ్చియిమ్మన్నా వెనుదీయని ధైర్యసాహసాలు గలిగినవాడు - నీకు దక్కితి, నీవు నాకు దక్కితివి, సాగిపోదామింక సరగున మనము - అంటూ సుఖలోకాల్లో కొత్త కొత్త పుంతలవెంట తనను తనవెంట త్రిప్పుకునేవాడు - అయిన భర్తకోసం ఎదురుతెన్నులు చూచివుంటుంది లీలావతమ్మ. ఆమె అదృష్టవంతురాలు. ఇంచుమించుగా అలాంటి భర్తే లభించా డామెకు! కానైతే అతడు తానాశించినట్టుగా ఒంటరిగా మాత్రం లేడు. (లీలావతమ్మ వూహల్లో) సరోవరం మధ్యలో తామరపువ్వు, దాని చుట్టూ ముండ్లనాచు.

"మా అబ్బాయి, మా అబ్బాయి" అంటూ కొందరు,—

"మా తమ్ముడు, మా అన్నయ్య" అంటూ కొందరు,

"మా మామయ్య" అంటూ మరి కొందరు—

ఈ సమూహంలో తన భర్తకింత వరకూ ప్రత్యేకమైన జీవితం లభించినట్టు లేదు!

"చూడమ్మా లీలా! వాడసలే అబ్బనాకారపు మనిషి. వేళకు పట్టెడన్నం పెడితే వాడింకేమీ అడగడు. ఆలస్యం జరిగితే అనారోగ్యం దాపురించినట్టే ...." అంటూ ముసలావిడ—

"వాడు లేనిదే మాకు పండుగల్లేవు. ఒకవేళ వాడు బద్ధకించినా నువ్వయినా బలవంతంచేసి ఏడాదికి నాలుగైదు సార్లు వచ్చి పోతుండాలి...." అంటూ బావగారు.

"నాన్నగారు, పెద్దన్నయ్య చల్లగా వున్నంత వరకూ మాకు చిన్నన్నయ్య పెట్టుపోతలు అక్కర్లేదులే చిన్న వదినా! అప్పు డప్పుడూ మీరు మా యిళ్ళకు వచ్చిపోతుంటే చాలు" అంటూ యింటబుట్టిన ఆడు పడుచులు.

అభిమానాలు, మమకారాలు అన్నీ తమ సొత్తే అయినట్టు అప్పగింతల పాట మినహాగా అంత పనీ చేశారు.

"వీళ్ళు వీక్కుతినే వాళ్ళలా వున్నారే తల్లీ! ఎరగక పోయి యిచ్చామే లీలా! బిడ్డ గతేమౌతుందో గదరా దేవుడా?" అంటూ కంటనీరు పెట్టుకుంది లీలావతమ్మ మేనత్త.

లీలావతమ్మ మేనత్తకు బిడ్డలులేరు. పుట్టని బిడ్డలపైన పెట్టవలసిన మాతృవాత్సల్యాన్నంతా ఆమె మేనకోడలికి మీదు కట్టింది. పెంచిన మమకారమేమో పాపం! భర్తకు రెండోపెళ్ళి చేసిన ఆడది గూడా అలా దురపిల్లి వుండదు.

వివాహ జీవితం ప్రారంభమైన కొత్తలో ప్రహ్లాదుడి భక్తి పారవశ్యంతో సరిపోల్చదగిన ప్రణయ పారవశ్యంలో వుండిపోయిన

సుదర్శనంగారికి యితరుల్ని గురించి ఆలోచించే అవకాశం సమకూరింది గాదు. ఆ తన్మయత్వం లోనుంచీ తేరుకునే సరికి ఆయనకు కనిపించిన వారు భార్య వైపు బంధువులు. వాళ్ళు అదృశ్య లోకాల్లోనుంచీ మానవ ప్రపంచంలోకి దిగి వచ్చిన కొత్త రకం నమూనాల్లా వున్నారు. కంటికి కనిపిస్తారే గానీ, కళ్ళు మూసుకుంటే వాళ్ళక్కడున్నందుకు గుర్తుగా కించిత్తు సవ్వడైనా వినరాదు. శత్రురాజ్యాల్లోకి ప్రవేశించిన గూఢచారుల్లా అంత గుంభనగ వుంటారు. మానవుడు కట్టిన గుళ్ళకూ గోపురాలకు వాళ్ళెంత దగ్గరగా వుంటారో, దేవుడు సృష్టించిన మానవులకు అంత దూరంగా వుంటారు. ఆచారపరాయణత్వం ఎంత యెక్కువో కలుపుగోలుతనం అంత తక్కువ. వాళ్ళకు మౌనభంగం కలగజేయడంకన్నా నాట్లుపెట్టి మందు దట్టించి పాషాణాలనైనా ఛేదించడం సులభం! విశ్వ ప్రయత్నం చేసి అంతపనీ చేశామబో - కొండపేటులో రాతినెరియలోనుంచీ బయటకు పొడసూపిన వృక్షాంకురంలా ముడివడిన పెదవుల కదలికలోనుంచీ మంద స్మితంలో దశాంశమైనా చేయని కాంతిలేశం ఒకటి యిట్టే కనుచూపును కికురించి మాయమౌతుంది....

సుదర్శనంగారు ఆశ్చర్యపడ్డారు. ఆ ఆశ్చరాన్ని ఏకాంతంలో భార్య సాన్నిధ్యంలో వెళ్ళగ్రక్కారు గూడా!


"చూడు లీలా! మరేమీ అనుకోకపోతే ఓమాట చెప్పాలని వుంది. మనుషులంగా పుట్టిన తరువాత బ్రతికిన నాలుగురోజులు ఆడుతూ పాడుతూ ఆనందంగా బ్రతకగూడదూ! ఏవో రాజ్యాలు పట్టదలచుకున్న వాళ్ళకుమల్లే ఆ మౌన మేమిటి? ఐశ్వర్యాలన్నీ ఒక ఎత్తయితే జీవనోత్సాహం ఒక్కటి మాత్రమే ఒకఎత్తుగదా! పోనీ వయసుమళ్ళిన వాళ్ళసంగతి వదిలేద్దాం. పరుగిడుతున్న పామును తరిమి పట్టుకునే వయస్సులో వున్న మీ తమ్ముళ్ళు ఇలా కళ్ళుతెరచుకునే నిద్రపోవడ మెందుకోనా కర్థంగాదు. మా యింట్లో మే మిలా కాదబ్బా! నాన్నగారూ, అన్నయ్యా, బావలెవరైనా వస్తే వాళ్ళు, వాళ్ళతోబాటుగా నేను - అందరమూ కలిసి పేకాటకు కూర్చునేవాళ్ళం! పెద్దా చిన్నా అన్న తారతమ్య విచక్షణ లేదనుకోవద్దు. అడ్డుగోడల్లేకుండా హాయిగా కాలం గడిపేవాళ్ళమంతే! ఆ సంబరాలే వేరు! ఆ సందడే వేరు...."

లీలావతమ్మ అభిమానవంతురాలని చెబితే చాలదు. ఆమె వ్యక్తిత్వానికి తీవ్రమైన స్వాభిమానమే పునాది అని చెప్పడం సమంజసంగా వుంటుంది. భర్త తనవాళ్ళను గురించి ఈసడింపుగా మాట్లాడినరాత్రి ఆమెకు కన్నుపొడుచుకున్నా నిద్రపట్టింది గాదు. 'అయ్యో, నత్తగుల్లల్ని ఎరుగరా' అంటూ కొంగలు హంసల్ని ఎగతాళి చేశాయట! మునుపటి కెవరో బెస్తవాడు పువ్వుల బజారులో వెళ్తూ 'అబ్బ, కంపు కంపు' అంటూ ముక్కులు మూసుకున్నాడట! వెకిలితనానికి ఆటపట్టయిన కుటుంబంలో పుట్టిన తరువాత ఆ సుగుణం ఈయనలో మాత్రం ఎందుకుండకపోతుంది? ఎదుటివారి పెద్దమనిషితరహా ఎలా అర్థమౌతుంది?

మరునాటి వుదయం కాస్త తొందరగానే నిద్రలేచిన సుదర్శనంగారికి లీలావతమ్మ








ముఖం అరుణోదయ సమయంలో పూర్వ దిశాంగన వదనంలా కమిలిపోయివున్నట్టు కనిపించింది. భార్య ముఖం జేవురించడానికి కారణమేమిటో ఆయన వూహకు అందింది గాదు.

● ● ●

నాటికి నేటికి పరిస్థితుల్లో ఎంతోమార్పు వచ్చినమాట నిజం!

ఆశించినంతకంటే ముందుగా సుదర్శనం గారికి ప్రమోషన్లు వచ్చాయి. ఆఫీసు కంతటికీ తనే అధికారి కావడం జరిగింది. సమాజంలో హోదా పెరిగింది. పిలిస్తే పలికే నౌకర్లు - కాలింగ్ బెల్ మ్రోత కోసం కాసుకుని కూచునే బంట్రోతులు - పనులకోసం ప్రాపకంకోసం యింటిచుట్టూ తిరిగే గొప్పవాళ్ళు. ఉద్యోగంలో ఉన్నతి మూలంగా దూరప్రాంతాలకు బదిలీలు. అక్కడివాళ్ళకు సుదర్శనం గారొకప్పుడు గుమాస్తాగా పనిచేశారనిగానీ, వాళ్ళ నాన్నగారు రిజిష్టరాఫీసులో దస్తావేజులు వ్రాసి చేసిన సంపాదనతో కొడుకులను చదివించాడనిగానీ తెలియక పోవడం - మున్నగు పరిణామాల న్నీ సుదర్శనంగారిపైన బాగా పనిచేశాయి. సూర్యోదయం ఆయన కంటబడి చాలా కాలమైంది. ఎనిమిదికో తొమ్మిదికో నిద్రలేచి, సింపాదిగా స్నానపానాలు, భోజనాదులూ ముగించి మిట్టమధ్యాహ్నవేళ కార్యాలయంలో ఎలక్ట్రిక్ పంకాక్రింద సేదదీరి, ఆఫీసు టైంలో యింకా మిగిలి వున్న వ్యవధిని క్రింది ఉద్యోగుల్ని గదమాయించడానికి వినియోగించి, ఆఫీసునుంచీ అలాగే ఏ క్లబ్బుకో, సమావేశానికో, సినిమాకో వేంచేసి దాదాపుగా అర్ధరాత్రి సమయానికి యిల్లుచేరుకునే అనుదిన కార్య

క్రమంలో సుదర్శనంగారికి వెనుదిరిగి తమ జీవితాన్ని సింహావలోకనం చేసుకునే అవకాశాలు లభ్యంకావు. భాషలో అభినివేశం గడించిన తర్వాత హల్లుల్లో అక్షర క్రమం మరచిపోయిన పండితుడిలా ఆయన తననుంచీ ఎవరెవరు ఎంతెంత ఆశించారన్న విషయాన్ని విస్మరించారు. అసలలాంటి తలపులకే ఆయన హృదయంలో చోటు దొరికింపిగాదు. పదిహేనేళ్ళక్రితం తండ్రిగారు పోయారు. సుదర్శనంగారు ఒంటరిగా వెళ్ళివచ్చారు. కన్నతల్లి అంతిమ యాత్రా సందర్భంలో ఆమాత్రమైనా చేయలేక పోయారు. తమ్ముడు ఒకానొక వూళ్ళో వున్నాడనుకుని అన్నగారు తంతియిస్తే - తమ్ముడికి ఆవూరినుంచీ బదిలీవచ్చి ఆరు మాసాలైంది. తంతి సకాలానికి చేరింది కాదు. సుదర్శనంగారి అక్కచెల్లెళ్ళ భర్తలు ఉద్యోగాలు చేసేవాళ్ళుకాదు. కనుక వాళ్ళ చిరునామాలు మారవు. కానీ తమ చిరునామా మారినప్పుడల్లా బంధువులకు జాబులు వ్రాస్తూ మారునేపాటి ఓపికగానీ తీరికగానీ సుదర్శనంగారికి లేదు. వాళ్ళు వస్తే రావచ్చు. వచ్చి కొంతకాలం వుండి పోవచ్చు. తనకేమీ అభ్యంతరం లేదు. కానీ వాళ్ళెందుకో రావడం మానేశారు!

వచ్చినప్పుడు వాళ్ళకెలాంటి మన్నన లభ్యమైందో, సుదర్శనంగారికి తెలియదు.

అప్పుడప్పుడు శుభలేఖలు కొన్ని టేబిలుపైన కనిపించేవి. ఎంతగా పెళ్ళికి రాడని తెలిసినా, మరెంతగా తమ కిష్టంలేకపోయినా మేనల్లుళ్ళకు, మేనకోడళ్ళకు పెళ్ళిళ్ళు జరుగుతున్నప్పుడు మేనమామకు ఆహ్వానం పంపకపోవడం సముచితంగా వుండదని ఆవతలవాళ్ళ ఉద్దేశం. 'అరే, యిదప్పుడే పెళ్ళి కెదిగిందా' - 'వీడికప్పుడే పెళ్ళా' అనుకునేవాడు సుదర్శనంగారు. ఒక్కొక్కప్పుడు సుదర్శనంగారి ఆశ్చర్యమే వధువుల పాలిటికి, వరుల పాలిటికి పెళ్ళి కానుకగా పరిణమించేది. ఎందుకంటే కొన్ని ఆహ్వానాలు తీరా శుభకార్యమైన తర్వాత పది పదిహేను రోజులకుగానీ ఆయన కంట బడేవిగావు.

వచ్చిన మార్పు సుదర్శనంగారి పైకి ఎంత తాపీగా వచ్చిందో, లీలావతమ్మ పైకి అంత ఉధృతంగా వచ్చింది. మార్పును తీవ్రంగా అభిలషించడం చేతనేగావచ్చు. కేవలం తన ఆత్మశక్తి మూలంగానే సిద్ధించినట్టు లీలావతమ్మ అనుకోగలిగింది. ఇప్పుడామెకు బీరువానిండుకూ చీరలున్నాయి. ఇనప్పెట్టెలో దండిగా నగలున్నాయి. ఆమె సుదర్శనంగారిని డబ్బడగదు. ఇంకా ఆయనే ఆమె నడిగి అవసరం వచ్చినప్పుడు పదో పాతికో తీసుకుంటాడు. కాలేజీలో చదువుకుంటున్న కుమారుడు తల్లికే వ్రాసి డబ్బు తెప్పించుకుంటాడు. పేరంటానికి ప్రక్కవీధికి వెళ్ళాలన్నా యింటి ముంగిటకు రిక్షాబండి వచ్చి నిలుస్తుంది.

ఇంతగా మందీ మార్బలం లేనిరోజుల్లో కూతురు ఒంటరిగా వుండిపోతుందన్న బెంగతో లీలావతమ్మ తండ్రి అల్లుడి గృహంలోనే మకాం పెట్టాడు. సుఖాల్లోనైనా, కష్టాల్లోనైనా భర్తను అనుగమించడమే భార్య ధర్మంగనుక లీలావతమ్మ తల్లి గూడా ఆపనే చేసింది. మేనత్తకు అంతకన్నా గత్యంతరం లేకపోయింది. మిగిలిన వాళ్ళు తమ్ముళ్ళిద్దరు. వాళ్ళను ప్రయోజకులుగా చేసి లోకానికి చూపించాలని లీలావతమ్మ ఎంతగా పాటుబడిందో అంతగా వీధి ప్రతికూలించింది. అక్కడా యిక్కడా ఏవో చిన్న ఉద్యోగాలు చేస్తూ వాళ్ళక్కడే తమ తమ ఆలుబిడ్డలతో సంసారాలు నడిపిన మాట నిజమే. అయినా, ఆ కాపురాలు బ్రాంచాఫీసుల్లాంటివి. హెడ్ ఆఫీసు అండదండలు, ఆదరాభిమానాలు పుష్కలంగా లభించకపోయి వున్నట్టయితే ఆ బ్రాంచాఫీసుల్ని ఎన్నడో మూసివేయవలసివచ్చేది!

ధ్యేయం సిద్ధించిన తరువాత, యిక ఆశింపవలసిందేమీ కనిపించక లీలావతమ్మ మహారాణి గుల్నారులా జీవితంలో ఉప్పూకారం కోసం ముఖంవాచిపోయి వుండవలసింది. ఆ పరిస్థితినుంచీ తప్పించి, మళ్ళీ కాలమే ఆమెను అనుగ్రహించింది. మొదటి ప్రణాళికను విజయవంతం చేయగలిగిన ఆత్మవిశ్వాసంతో - ఆమె తన ధ్యాసను కొడుకుల చదువుపైకి, కూతురు పెళ్ళిపైకి మళ్ళించి ద్వితీయ ప్రణాళికకు పథకం తయారుచేయడంలో నిమగ్నురాలైంది. చదువులకేమి, డబ్బుంటే అవి మంచినీళ్ళప్రాయం! వచ్చిన చిక్కల్లా పెళ్ళిదగ్గరే! తెల్లనివన్నీ పాలనుకోగూడదు. పైపై మెరుగులు చూచి మోసపోగూడదు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోగూడదు!

సంబంధాలు తీసుకరాని దోషం సుదర్శనంగారిది గాదు. ఫైళ్ళమీద తన అభిప్రాయాన్ని వ్రాసి పైవాళ్ళ పరిశీలనకోసం పంపుకోడం ఆదినుంచీ ఆయన చేస్తున్న పనే! ప్రతి సంబంధమూ లీలావతమ్మ నిశిత పరీక్షకు గురైంది. నచ్చలేదన్న ఆఖరు నిర్ణయంతో ప్రతి ఫైలు తిరుగుదారి పట్టినకొద్దీ సుదర్శనంగారిలో చిరాకు ఎక్కువైంది.

ఐనా లీలావతమ్మ మాత్రం ఏం చేస్తుంది? నాలుగు సంవత్సరాలపాటు గాటిలో కట్టేసుకుని, బండి మడకాలాంటి సేద్యం పనులు చేసుకోడానికి అవసరమయ్యే కోడెల్ని బేరమాడ్డం చూడాలి! కొమ్ము వాటం బాగుందా, నడుములో సత్తావుందా, సుళ్ళున్నాయా, బాగా నెమరు వేస్తుందా అంటూ వెయ్యి జాగ్రత్తలు తీసుకుంటారు. మరిక్కడమాత్రం అల్లుడు తేరగా దొరకడం లేదుగదా! సంచులతో కాసులు కుమ్మరించాలిగదా! ఆదమరిస్తే కొంపమునగదూ!

ఒక సంబంధమైతే సూటికి మూరుపాళ్ల కుదిరినట్టే తోచి, చివరికొక్క లా పాయింటుతో బెడిసిపోయింది. కుర్రవాడు అందగాడే! విద్యాధికుడే! కాలుమీద కాలువేసుకుని తిన్నా తరిగిపోని ఆస్తి పాస్తులున్నాయి. అన్ని శుభలక్షణాలకూ తలమానికంగా తండ్రి కొక్కడే కొడుకు. తల్లి అతడి చిన్ననాడే చనిపోయింది. అంతా బాగానేవుంది. కానీ పుట్టు పూర్వోత్తరాల సంగతి వాకబుచేయగా ఓ దారుణమైన విషయం బయటపడింది. ఆ కుర్రాడి తల్లి భర్తపోరు పడలేక ఆత్మహత్య చేసుకుందట! అది తరతరాలుగా తుపాకులు చేతబట్టి అరణ్యాల్లో వేటకువెళ్ళే కుటుంబమట! మృగాలను వేటాడేవాళ్ళకు మనుషులొక లెక్కా!

శివధనుర్భంగం మానవసాధ్యం కాదేమో ననుకున్న జనకమహారాజులా సుదర్శనంగారు దిగులుపడిపోతున్న సమయం. లోకం గొడ్డుపోలేదు. ఇదిగో

నేనున్నాను - అన్నట్టుగా రంగంలో విశ్వం ప్రత్యక్షమయ్యాడు!

అల్లుడికి అవసరమైన మంచి లక్షణాలు కొన్ని విశ్వంలో వున్నమాట నిజమే! కానీ ఈ సంబంధంలోనైనా బొత్తిగా లోపాలు లేవని చెప్పడం సాధ్యంగాదు. ఆ లోపాల్ని సరిపెట్టుకోదలచింది లీలావతమ్మ.

మీరు సరిపెట్టుకోడంతో ఏమయింది: నాకూ సరిపడాలిగాదా - అన్నట్టు అత డీలా చడీ చప్పుడూ లేకుండా చల్లగా జారుకో గలడని లీలావతమ్మ కేం తెలుసు!

సుదర్శనంగారు యింటికి రాగానే ఆమె చెప్పదలచుకున్న నాలుగు మాటలూ ఘాటుగా చెప్పేసింది.

"ఏమిటండీ మీరు! ఏం జరుగుతోందో తెలుసా మీకు? ఎరుగకపోయి మన చాప క్రిందికి ఘనమే నీళ్ళు తెచ్చుకున్నట్టయింది. ఆ కుర్రాడు మన సంబంధం తన కిష్టం లేదని చెబుతున్నాడట! తనెన్నడూ మనకు మాట యివ్వలేదనిగూడా చెబుతున్నాడట! ఇలాంటి బుద్ధిమంతుడు మరొకడు దొరక డనిగాదు. కానీ యిప్పుడు లోకు లేమను కుంటారు? ఏ లోపాన్ని గమనించి యిత గాడు మన సంబంధం వద్దంటున్నాడు? ముసుగులో గుద్దులాటలు మనకు పనికి రావు. నిక్కచ్చిగా నిలదీసి అడిగి తెలుసు కోవాలి మీరు...."

విశ్వంకోసం కబురు వెళ్ళింది. మనిషినే వెంటబెట్టుకురమ్మని జవానును పంపితే - అతగాడు ఉత్తరం తీసుకొచ్చాడు.

"పూజ్యశ్రీ సుదర్శనంగారికి


నమస్కారాలతో విశ్వం వ్రాసుకున్నది—

కొన్ని అవాంఛనీయ పరిణామాలవల్లనే గావచ్చు - నా ప్రవర్తన అపార్థానికి గురైంది. నా పరిస్థితుల్ని వివరించి చెప్పు కుంటే మీరు నన్ను మన్నించగలరని నాకు తెలుసు. ఎట్టయెదుట కూర్చుంటే వాటిని మీకు నేను ఒక క్రమంలో చెప్పలేక పోవచ్చు. ఎలాంటి అవ్యాప్తి అతివ్యాప్తి దోషాలు లేకుండా సంజాయిషీ చెప్పుకో డానికే ఈ ప్రయత్నం.

మీలాంటివారు ఆశలు పెట్టుకోడానికి నేను తగనేమోనన్న అభిప్రాయం నా కాదినుంచీ వుంది: అందుకు కారణాలు లేక పోలేదు. నేను సామాన్యమైన కుటుంబంలో పుట్టాను. ఎంత సామాన్యమైన కుటుంబమో మీ రూహించలేరు. నేను పుట్టిన రోజుల్లో ఏపూట కాపూట గడవడమే బ్రహ్మాండంగా వుండేది. మా నాన్నగారికి ఒక్క తమ్ముడు - నలుగురు చెల్లెళ్ళు. మేనత్తల్లో పెద్దవాళ్ళ కిద్దరికే అప్పటికే పెళ్ళిళ్ళు జరిగాయి. మా నాన్నగారు పల్లెటూళ్ళో వీధిబడి చెప్పే వారు. మా చిన్నాన్న కొద్దిపాటి పొలం కౌలుకు చేసేవాడు. నేను పుట్టిన సంవత్సరం మా నాన్నగారి వీధిబడిని ప్రభుత్వం గుర్తించి వందరూపాయల గ్రాంటు యిప్పిం చింది. మా చిన్నాన్న కౌలుకు చేస్తున్న పొలంలో మా వాటాకు నాలుగు గోనెల బెల్లం వచ్చి ఆయేడు గోనె బెల్లం యాభై రూపాయలు పలికింది. అందువల్ల కుటుం బంలో నేను అదృష్టవంతుడినన్న భావం కలిగింది. క్రిందపెడితే కందిపోతానేమో నన్నంత సుకుమారంగా వాళ్ళు నన్ను పెంచి పెద్దజేశారు.

అప్పటికి నాకు నాలుగేళ్ళప్రాయ ముంటుందేమో! కొండక్రింద మిట్టపల్లాల నేల ఒకటి మా నాన్నగారి పేరిటికి పట్టా వచ్చింది. ఉదయం లేవగానే యింటిల్లిపాదీ






అక్కడకు వెళ్ళిపోయేవాళ్ళం. నన్ను చెట్టు క్రింద కూర్చోబెట్టి ఆడా మగా భేదం లేకుండా మావాళ్ళు గొడ్డళ్ళతో గునపాలతో నేలను చదునుచేసేవారు. మధ్యాహ్నమయ్యే సరికి మా అమ్మ పెద్దతట్టతో అన్నం తీసు కొచ్చేది. ఆ విధంగా చదునైన నేలలో మా దొడాయి నిలువులోతు గుంటలు తీసి మామిడి మొక్కలు పాతాడు. మా పిన్నమ్మ, మేనత్తలు అరమైలు దూరం నుంచీ నెత్తిపైన నీటి కడవలు మోసి ఆ మొక్కల్ని కాపాడారు. ఎందుకు చెబు తున్నానంటే ఆ మామిడితోపు మహమూలే గనుక లేకపోతే నా చదువు కొనసాగేది గాదు.

మా దొడాయికి ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు. నా కిద్దరు తమ్ముళ్ళున్నారు. మీ రొకసారి మా యింటికి వెళ్ళి చూస్తే ఆ యింట పుట్టిన కుర్రవాడు ఎం. ఏ. దాకా చదువుకోగలిగి వుంటాడని అనుకోలేరు. మావూరి పరిసరాల్లో కట్టెకోసమనీ, కంపల కోసమనీ మాయింటి ఆడపడుచులు ఎక్కి దిగని గుట్టల్లేవు. కుటుంబాన్ని ఉద్ధరించ డానికి నేనొక్కణ్ణి చదువుకుంటే చాలునని తమ్ముళ్ళిద్దరు చదువులు మానుకున్నారు.

కానీ నేలనున్నవారు నేలనే వుండరు. మంచిరోజులు దగ్గరలో వున్నాయన్న ఆశ లేకపోతే లేమిని భరించడం అసాధ్యం. పోయిన సంవత్సరం మా మామిడితోపులో దావి పడుతుందని ఎవరో చెప్పారు. ఆశ దొడ్డది. అది ఎంతటి సామాన్య మానవుల చేతనైనా గొప్పకార్యాలు చేయిస్తుంది. కూలీలను పెడితే ఆరు మాసాలకైనా పూర్తి కాని దావి త్రవ్వకం మూడు మాసాలకే పూర్తయింది. నాలుగో మట్టులో నీళ్ళు కని

పించాయి. ఓ పంపుసెట్టు తగిలిస్తే దాని క్రింద బంగారం పండుతుంది....

ఇవి నా పరిస్థితులు.

ఇలాంటి బాధ్యతలను భుజానమోస్తూ నేను నా జీవితంలోకి రాబోతున్న అర్థాంగిని ఏమాత్రం సుఖపెట్టగలనో తెలియదు. ముచ్చటైన బంగాళాలో చిన్న స్టౌ మీద వంటచేసి పెట్టటం మినహాగా మరొక అదనపు బరువును స్వీకరించనొల్లని యిల్లాలు లభ్యమైతే - మా కుటుంబం సంగతి వెన్న వడుతుండగా పగిలిపోయిన బాన చందమౌతుంది. అలాగని నేను నూవాళ్ళ కేదో పెన్నిధిని త్రవ్వి తలకెత్తబోతున్నానని గాదు. సిరిసంపదలకన్నా. భోగభాగ్యాల కన్నా మమకారాలను, ఆత్మీయతలను ప్రాణప్రదంగా చూచుకోగలిగితే చాలు.

ఇంతకు మించి నేను చెప్పగలిగిందేమీ మించి లేదు. మీరు పెద్దలు. విజ్ఞులు. మిగిలిన నిర్ణయాలు మీకే వదిలేస్తున్నాను.."

నాలుగు రోజుల తర్వాత ఓ ఆదివారం నాడు మధ్యాహ్న భోజనానంతరం మేడ పైన గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు సుదర్శనంగారు. కత్తివేటుకు నెత్తురు చుక్క లేని ముఖంతో భర్తగారి బేటీకి వెళ్ళింది లీలావతమ్మ.

"జనానావారి నిర్ణయమేమిటో తెలిసింది గాదే!" అన్నారు సుదర్శనంగారు.

"ఏం చెప్పమంటారు! కొరివితో తల గోక్కున్నట్టుంది! ఆ కుర్రాడు దీని కేదో మచ్చుమందే చల్లినట్టున్నాడు. ఇంతచిన్న వయస్సులో అలాంటి గొప్ప బాధ్యతలు మోయలేవే పిల్లా అంటే వింటేనా! అపర సావిత్రిలా బయల్దేరింది. పోనీలెండి. ఎవరి కర్మకు ఎవరు కర్తలు...."

"అమ్మాయి కెలాగైనా నచ్చ జెప్పి ఆ ఫిరంగికోట వాళ్ళ సంబంధమే నిశ్చయించ గూడదా లీలా!" ఆలోచిస్తూ అడిగారు సుదర్శనంగారు.

"ఆ మనుషుల్ని వేటాడే వాళ్ళకా పిల్లని ఇవ్వడం?" తీక్షణంగా ప్రశ్నించింది లీలావతమ్మ.

"ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధంగా ప్రసిద్ధి వస్తుంది. సహజమే! ఓ విధంగా చూస్తే లోకమంతా మా ఆఫీసులాగే వుంది. ఓ గుమాస్తా అలస్యంగా తప్ప ఆఫీసుకు రాడు. వేరొకడికి పనిచెబుతే ప్రాణాలు పోతాయి. ఇంకొకతనికి లంచాలంటే పోయిన ప్రాణాలు లేచి వస్తాయి. వాళ్ళ వాళ్ళ ఎన్నుకున్న పద్ధతుల్లో వాళ్ళకు కాలం హాయిగానే గడచి పోతున్నట్టు తోస్తుంది. వాళ్ళకు సంబంధించిన బ్లాక్ మార్కులు, రెడ్ ఎంట్రీలు ఎప్పటి కప్పుడు ఓ పుస్తకంలో నమోదు చేయబడుతూ వుంటాయన్న విషయం వాళ్ళకెందుకు అర్థం కాదో తెలియదు. అవసరం వచ్చినప్పుడు ఆ పుస్తకాన్ని తిరగ వేయడం జరుగుతుంది. చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత! అనుభవించక తప్పుతుందా లీలా!"

లీలావతమ్మ తెల్లబోయింది. తెల్లబోతూ భర్తముఖంలోకి పరిశీలనగా చూచింది. ఆ ముఖంలో కోపంలేదు. తొందరపాటు లేదు. ఆయన చిత్రహింసకు గురైన తర్వాత అపరాధాన్ని బయటపెట్టిన నేరస్తుడిలా వున్నాడు. □□□





ఎప్పటి కేది అవసరమో అప్పటికది మాట్లాడేసి, అన్యుల మనస్సులు నొప్పించక, తన మనస్సు నంతకంటే బాధపెట్టకుండా ఉండేవాడే మనిషి సుమా అంటాడు సుమతీ శతకకారుడు.

నిజమే మరి. ఏదేనా మాట్లాడేప్పుడు జాగ్రత్త అత్యవసరమే. అందుకే కదండీ కాలుజారితే తీసుకోగలం గానీ నోరుజారితే తీసుకోలేం అన్నారు మనవాళ్ళు. అసలు ఈమాట పొందిక గురించి రాబర్ట్ లిండ్ అనే మహాశయుడు పేద్ద వ్యాసమొకటి రాసి పారేశాడు. సరే, ఎప్పటి కేది అవసరమో అది మాట్లాడమన్నాడుకదాని, నిత్యం అబద్ధాలాడ్డం మంచిదేనా అంటాడు మా మిత్రవరేణ్యుడు. ఎందుకంటే ఆయన తన మిత్రుల మనంబులు నొప్పింపకుండా ఉండాలంటే, లేచిన దగ్గరనుంచి పడుకొనేదాకా అబద్ధాలాడాల్సి వస్తోందిష.

కొన్నికొన్ని నీతిసూత్రా లున్నాయి చూశారూ, మనకి బోధపడవు. బహుశా మన బుర్రలకు (క్షమించాలి) అతీతమేమో! ఈమధ్య ఒక సంగతి జరిగింది. ఒకే వీథిలో నాకు యిద్దరు స్నేహితురాళ్ళున్నారు. ఒకరింటికి వెళితే రెండో ఆమె యింటికి వెళ్ళి తీరాల్సిందే. లేకపోతే నా పరువు మరి ఉండదు.

నా ఖర్మానికి ఒక శుభవేళ ఒకామె దగ్గరకు వెళ్ళాను. ఆవిడ ఆరోజు సినిమా కెడదామంటూ నన్ను లాక్కుపోయింది. అంతే నా రెండో మిత్రురాలింటికి నేను వెళ్ళలేకపోయానన్న మాటేకద. నా మనస్సులో భయంగానే ఉంది. అయినా చిన్న ఆశాకిరణం కనిపించింది. నే నక్కడి కొచ్చినట్టు ఆవి డెలా చూస్తుందిలే అనుకొన్నా కానీ ఈ మిత్రురాలుంది చూశారూ